7

సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

ఆదివారం । 15 । డిసెంబర్ । 2024



సన్‌ఫ్లవర్.. క్లిక్.. క్లిక్

మన్యం సందర్శనకు వచ్చే పర్యాటకులు పొద్దుతిరుగుడు పూల శోభలో మునిగితేలుతున్నారు. ఫొటోలు, సెల్ఫీలు తీసుకునేందుకు వీరిచ్చే రుసుంతో గిరి రైతులు మంచి ఆదాయం పొందుతున్నారు.

8లో

న్యూస్‌రీల్

పర్యాటకులకు శుభవార్త

- అందుబాటులోకి 'కృష్ణాపురం ఎకో టూరిజం ఇనీషియేట్'



పర్యాటకుల కోసం సిద్ధం చేసిన టెంట్లు

చింతపల్లి: మండలంలో అటవీశాఖ ఆధ్వర్యంలో కృష్ణాపురంలో ఏర్పాటుచేసిన ఎకో టూరిజం ఇనీషియేట్‌ను శనివారం నుంచి అందుబాటులోకి తెచ్చారు. పర్యాటకుల కోసం క్యాంపెయిన్ టెంట్లు ఏర్పాటుచేశారు. వీటికి అద్దె చెల్లించి వినియోగించుకోవచ్చు. ఇటీవల అటవీశాఖ నిధులు కేటాయించడంతో గ్రీజర్లు, ద్వారం, విద్యుత్ సౌకర్యాలను అందుబాటులోకి తీసుకువచ్చినట్టు చింతపల్లి రేంజ్ అధికారి బి.అప్పారావు తెలిపారు. ప్రవేశ రుసుం రూ.30, పెద్ద టెంట్‌కు రూ.1200, చిన్న టెంట్‌కు రూ.800గా అద్దె నిర్ణయించినట్టు ఆయన వివరించారు.

గంజాయి నిర్మూలనకు పటిష్ట చర్యలు



అన్నవరం పోలీసు స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ షేక్ షహబాజ్ అహ్మద్

చింతపల్లి: మన్యంలో గంజాయి సాగు, రవాణాను పూర్తిస్థాయిలో అరికట్టేందుకు పటిష్ట చర్యలు చేపట్టాలని చింతపల్లి డీఎస్పీ షేక్ షహబాజ్ అహ్మద్ ఆదేశించారు. శనివారం ఆయన మండలంలోని అన్నవరం పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి సాగు రవాణా అనర్థాలపై గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐ వినోద్‌బాబు, ఎస్ఐ వీరబాబు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదిక రేపు

రంపచోడవరం: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ఈ నెల 16న యథావిధిగా నిర్వహిస్తామని స్థానిక ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం తెలిపారు. టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగా కొన్ని రోజులు గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించలేదన్నారు. గిరిజనులు తమ సమస్యలను గ్రీవెన్స్ దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవచ్చునని సూచించారు.

రిపబ్లిక్ డే పరేడ్‌కు ఏయూ విద్యార్థులు

విశాఖ విద్య : దేశ రాజధానిలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే రిపబ్లిక్ డే పరేడ్‌లో పాల్గొనడానికి ఏయూ జాతీయ సేవా పథకం నుంచి ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా పది మంది విద్యార్థులు ఎంపిక కాగా ముగ్గురు ఏయూ విద్యార్థులు కావడం గమనార్హం. ఇటీవల ఏయూ నుంచి ఆరుగురు విద్యార్థులు ప్రీ రిపబ్లిక్ డే శిక్షణ శిబిరానికి హాజరయ్యారు. వీరిలో ప్రతిభ కనబరిచిన ముగ్గురిని ఎంపిక చేశారు. నెలరోజులపాటు వీరు దేశ రాజధానిలో శిక్షణ పొంది జనవరి 26న జరిగే పరేడ్‌లో భాగమవుతారు. ఆనందపురం ఏక్యూజే పీజీ కళాశాలకు చెందిన యు.గణేష్, మల్కాపురంలోని సెయింట్ ఆన్స్ మహిళా కళాశాలకు చెందిన పి.దివ్యశ్రీ, సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలకు చెందిన గుడ్ల కుశాంక ఏయూ తరపున ఎంపికైనట్లు ఉత్తర్వులు ఏయూ జాతీయ సేవా పథకం సమన్వయకర్త ఆచార్య ఎస్.హరినాథ్‌కి అందాయి.

ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ మీట్‌కు ఏర్పాట్లు

మురళీనగర్ (విశాఖ): ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ రీజనల్ మీట్‌కు ఏర్పాట్లు చేస్తున్నట్లు కంచరపాలెం పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు తెలిపారు. ఈనెల 19నుంచి 21వరకు నిర్వహించనున్న స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్‌ను విజయవంతం చేయాలని కోరారు. పోటీలకు సంబంధించి డ్రా తీశారు.

స్పోర్ట్సు మీట్ వివరాలు: ఈ స్పోర్ట్స్ మీట్‌లో ఏయూ రీజియన్ పరిధిలోని 27 పాలిటెక్నిక్ కాలేజీలకు చెందిన 1200 మంది క్రీడాకారులు పాల్గొంటారు. కంచరపాలెం పాలిటెక్నిక్ కాలేజీ వేదికగా మూడు రోజులు నిర్వహించనున్న ఈ మీట్‌లో అథ్లెటిక్స్ ట్రాక్ అండ్ ఫీల్డ్, వాలీబాల్, కబడ్డీ, బాల్ బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్, కోకో చెస్ క్రీడలు నిర్వహిస్తారు. ట్రాక్ అండ్ ఫీల్డ్‌లో 100, 200, 300, 400, 800 మీటర్లతో పాటు, 100 మీ''4 రిలే మీట్ ఉంటుంది. త్రో డిస్కస్, షాట్ పుట్, జావిలెన్ త్రో, లాంగ్ జంప్, ట్రిపుల్ జంప్, హైజంప్ పోటీలు ఉంటాయి.

మాచ్‌ఖండ్ మిలమిల

- అవాంతరాలను అధిగమిస్తున్న జలవిద్యుత్ కేంద్రం అధికారులు
- రోజురోజుకు మెరుగుపడుతున్న ఉత్పాదన
- ఏడాదికి సరిపోయేంత నీటి నిల్వలు
- 1,3,4,6 నంబర్ల జనరేటర్లతో 75 మెగావాట్ల మేర ఉత్పత్తి
- కొద్దిరోజుల్లో వినియోగంలోకి 2,5 యూనిట్లు



మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రంలో పూర్తిస్థాయిలో ఉత్పాదనకు ప్రాజెక్ట్ అధికారులు కసరత్తు మొదలు పెట్టారు. నీటి నిల్వలు పుష్కలంగా అందుబాటులో ఉన్నందున ఆరు యూనిట్లను వినియోగంలోకి తెచ్చేందుకు శ్రమిస్తున్నారు. ఇప్పటికే నాలుగు యూనిట్లు పనిచేస్తుండగా, మిగతా రెండు యూనిట్లు కూడా కొద్ది రోజుల్లో ఉత్పత్తి ప్రారంభించేలా ఏర్పాట్లు చేస్తున్నారు.



మాచ్‌ఖండ్‌లో జనరేటర్లు

ముంచంగిపుట్టు: ఆంధ్ర ఒడిశా రాష్ట్రాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పాదన రోజురోజుకు మెరుగుపడుతోంది.


- ప్రాజెక్ట్‌లో ఆరు జనరేటర్ల సాయంతో 120 మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసే సామర్థ్యం ఉంది. తరచూ జనరేటర్లు మరమ్మతులకు గురి కావడం ఉత్పత్తిపై తీవ్ర ప్రభావం చూపింది.
- గత ఏడాది ఆగస్టులో ఆరు జనరేటర్లు వినియోగంలోకి వచ్చాయి. దీంతో 120 మెగావాట్ల విద్యుత్ ఉత్పాదన చాలా సంవత్సరాల తర్వాత ప్రాజెక్టులో జరిగింది. ఈ ఏడాది మార్చి వరకు మెరుగ్గానే ఉత్పత్తి ఉంది. నీటి సమస్య కారణంగా ఏప్రిల్ నుంచి దారుణంగా ఉత్పత్తి పడిపోయింది. ఈ ఏడాది మే, జూన్, జూలై నెలల్లో ఒక జనరేటర్ మాత్రమే పనిచేయడం వల్ల 21 మెగావాట్లు మాత్రమే విద్యుత్ ఉత్పత్తి జరుగుతూ వచ్చింది.
- ఈ ఏడాది మే, జూన్, జూలైలో నీటి కొరత కారణంగా ఉత్పత్తికి తరచూ అంతరాయం ఏర్పడేది. ఆగస్టు నుంచి విస్తారంగా వర్షాలు కురవడం వల్ల ఈ ప్రాజెక్టుకు ప్రధాన ఆధారమైన జోలాపుట్టు, డుడుమ జలాశయాల నీటి మట్టాలు గణనీయంగా పెరిగాయి. అయినప్పటికీ సాంకేతిక సమస్యలు తలెత్తడంతో తరచూ విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయేది.
- సెప్టెంబర్‌లో భారీ వర్షాలకు వరద నీరు ప్రాజెక్ట్‌లోకి చేరడం వల్ల నాలుగు రోజులు ఉత్పత్తి నిలిచిపోయింది. టీపీ డ్యామ్ వద్ద నీటిని నియంత్రించడంలో జాప్యం వల్ల టర్బైన్ల లోకి నీరు ప్రవేశించింది. దీంతో అప్రమత్తమైన అధికారులు వెంటనే ఉత్పత్తి నిలిచిపోయింది. అగ్నిమాపక సిబ్బంది, ప్రాజెక్ట్ అధికారులు శ్రమించి ఉత్పాదనను అందుబాటులోకి తెచ్చారు.
- ప్రాజెక్ట్ నుంచి విశాఖ ఫీడర్‌కు వెళ్లే లైన్‌కు సంబంధించి సీవీటీ సెప్టెంబర్‌లో పేలిపోవడంతో ఒకరోజు ఉత్పాదన నిలిచిపోయింది.
- జోలాపుట్టు జలాశయ పూర్తి స్థాయి నీటి మట్టం 2750 అడుగులు కాగా బుధవారం నాటికి 2746.10 అడుగులుగా నమోదు అయింది.గత ఏడాది ఇదే రోజుకు 2724.70 అడుగులు మాత్రమే నీరు ఉండేది. గత ఏడాదితో పోలిస్తే 22 అడుగులు నీరు అధికంగా ఉంది.

మెరుగుపడుతున్న ఉత్పత్తి

- జోలాపుట్టు, డుడుమ జలాశయాల్లో నీటి మట్టాలు ఎన్నడూ లేని విధంగా పెరగడంతో విద్యుత్ ఉత్పత్తి కూడా పెరిగింది. ప్రస్తుతం 1,3,4,6 నంబర్ల జనరేటర్లతో 75 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగుతోంది. రెండవ నంబరు జనరేటర్‌ను కొద్దిరోజుల్లో వినియోగంలోకి తెచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఐదవ నంబరు జనరేటరు ఆధునీకరించే పనుల్లో ప్రాజెక్ట్ సిబ్బంది నిమగ్నమయ్యారు. ఈ రెండు జనరేటర్లు వినియోగంలోకి వస్తే 120 మెగావాట్ల ఉత్పత్తి సాధ్యపడుతుంది.

పెరుగుతున్న నీటిమట్టాలు

మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రానికి నీరు అందించే డుడుమ, జోలాపుట్టు జలాశయాల్లో నీటిమట్టాలు పూర్తిస్థాయిలో ఉన్నాయి. డుడుమ పూర్తి స్థాయి నీటి మట్టం 2590 అడుగులు కాగా బుధవారం నాటికి 2581.60 అడుగులుగా నమోదు అయింది.



జోలాపుట్టు జలాశయంలో పుష్కలంగా నిల్వలు

కొద్దిరోజుల్లో పూర్తిస్థాయి ఉత్పత్తి



డుడుమ, జోలాపుట్టు జలాశయాల్లో ప్రస్తుతం ఏడాదికి అవసరమైన నీటి నిల్వలు ఉన్నందున విద్యుత్ ఉత్పత్తిని పెంచేందుకు కృషి చేస్తున్నాం. ప్రస్తుతం 75 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగుతోంది. రెండవ నంబరును వినియోగంలోకి తీసుకురావడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. పూర్తిస్థాయిలో విద్యుత్ ఉత్పత్తి మరికొన్ని రోజుల్లో జరిగే ఆస్కారం ఉంది. ఈ దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయి.

– ఏవీ సుబ్రమణ్యేశ్వరరావు, ఎస్ఈ, మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రం

కినపర్తి పరిసరాల్లో పెద్దపులి సంచారం

- గుర్తించిన యువకుడు చిన్ని
- ఆందోళనకు గురై అపస్మారక స్థితికి..
- వెంటనే ఆస్పత్రికి తరలింపు
- అత్యవసర వైద్యంతో మెరుగుపడిన ఆరోగ్య పరిస్థితి



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్ని

అడ్డతీగల: మండలంలోని కినపర్తి అటవీ ప్రాంతంలో పెద్దపులి సంచారంపై పరిసర ప్రాంతీయులు ఆందోళనకు గురవుతున్నారు. శనివారం కినపర్తికి చెందిన తొండం చిన్ని అనే గిరిజన యువకుడు పొలంలోంచి వస్తుండగా కనిపించడంతో ఆందోళనకు గురయ్యాడు. వెంటనే ఇంటికి వచ్చిన కాసేపటికే అపస్మారక స్థితికి గురయ్యాడు. వెంటనే బంధువులు, కుటుంబ సభ్యులు స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువచ్చారు. వెంటనే అత్యవసర వైద్యం అందించడంతో తేరుకున్నాడు. ఆకస్మాత్తుగా పెద్దపులిని చూసి ఆందోళనకు గురయ్యాయని, ఏంచేయాలో తోచక పరిగెత్తికుంటూ వచ్చానని స్థానికులకు వివరించాడు. దీంతో వారు గ్రామస్తులను అప్రమత్తం చేశారు. అటవీశాఖ అధికారులు స్పందించి పెద్దపులి నుంచి రక్షణ కల్పించాలని వారు కోరుతున్నారు.

పెద్దపులి దాడి బాధితులకు నష్టపరిహారం

- అందజేసిన అటవీశాఖ ఉన్నతాధికారులు

కూనవరం: మండలంలో గత సెప్టెంబర్ 30న జరిగిన పెద్దపులి దాడి ఘటనలో మృతి చెందిన రెండు పశువులకు సంబంధించిన యజమానులకు ప్రభుత్వం నష్టపరిహారం మంజూరు చేసిందని సబ్ డీఎఫ్‌వో కేవీఎస్ రాఘవరావు, ఫారెస్టు రేంజర్ ఎం.కరుణాకర్ తెలిపారు. బోదునూరు గ్రామానికి చెందిన సొడె శ్రీను ఎద్దుకు రూ.25 వేలు, అదే గ్రామానికి చెందిన తుష్టి జోగయ్య ఆవుకు రూ.40 వేలు మంజూరైందన్నారు. ఈ మొత్తాన్ని శనివారం బాధితులకు అందజేశామని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా చింతూరు డీఎఫ్‌వో బబితకు బాధితులు కృతజ్ఞతలు తెలిపారు.

ఇంధన పొదుపు వారోత్సవాలు ప్రారంభం



జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలను ప్రారంభిస్తున్న జాయింట్ కలెక్టర్ అభిషేక్‌గౌడ



పాడేరు పాతబస్టాండ్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యుత్ ఉద్యోగులు

సాక్షి,పాడేరు: జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తూర్పు విద్యుత్ పంపిణీ సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన వారోత్సవాల ర్యాలీని కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ డాక్టర్ అభిషేక్‌గౌడ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఐటీడీఏ మీదుగా పాతబస్టాండ్ వరకు ర్యాలీని నిర్వహించారు. విద్యుత్ పొదుపుపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ జీఎన్ ప్రసాద్, ఈఈ ఏవీఎస్ఎం అప్పారావు పాల్గొన్నారు.

పొదుపుగా విద్యుత్ వినియోగం

రంపచోడవరం: విద్యుత్ పొదుపు చేయడం ద్వారా భావితరాల వారికి వెలుగునిచ్చేవారం అవుతామని రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం అన్నారు. విద్యుత్ పొదుపు వారోత్సవాల్లో భాగంగా శనివారం నిర్వహించిన ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ ఈ నెల 14 నుంచి 20 వరకు విద్యుత్ పొదుపు వారోత్సవాలు జరుగుతాయన్నారు. ప్రతీ ఇంట్లో విద్యుత్ ఆదా చేసే బాధ్యత అందరి వినియోగదారులపై ఉందన్నారు. విద్యుత్‌ను పొదుపుగా వాడడం వల్ల తక్కువ విద్యుత్ బిల్లు వస్తుందన్నారు. ఒక యూనిట్ విద్యుత్ పొదుపు చేస్తే ,రెండు యూనిట్లు విద్యుత్ ఉత్పత్తి చేసినట్లే అన్నారు. ఐటీడీఏ నుంచి అంబేడ్కర్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. విద్యుత్ పొదుపుపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఈఈ టి గాబ్రియల్, డీఈ మల్లికార్జునరావు, ఏఈలు దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

చెరువులవేనం వ్యూపాయింట్ సందర్శన

- ప్రకృతి అందాలను తిలకించిన డ్వామా పీడీ విద్యాసాగర్



వ్యూపాయింట్ వద్ద మంచు అందాలను తిలకిస్తున్న డ్వామా పీడీ విద్యాసాగర్ తదితరులు

చింతపల్లి: మండలంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతమైన చెరువులవేనం వ్యూపాయింట్‌ను శనివారం డ్వామా పీడీ డాక్టర్ డి.విద్యాసాగర్ కుటుంబసభ్యులతో సందర్శించారు.మంచు అందాలను తిలకించారు. తాజంగి జలాశయంలో కొంతసేపు బోటు షికారు చేశారు. అనంతరం తాజంగిలో ఉపాధి హామీ పథకంలో సాగు చేస్తున్న డ్రాగన్ ఫ్రూట్ తోటను పరిశీలించారు. ఇందుకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. ఆయన వెంట ఏపీవో రాజుబాబు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మన్యంలో తగ్గుతున్న ఉష్ణోగ్రతలు

- చింతపల్లి ఏడీఆర్ ఆళ్ల అప్పలస్వామి
- చలిగాలులకు వణుకుతున్న గిరిజనం



పాడేరులో కురుస్తున్న పొగమంచు



లంబసింగి ఘాట్‌రోడ్డులో దట్టంగా కురుస్తున్న పొగమంచు

చింతపల్లి; మన్యంలో ఉష్ణోగ్రతలు రోజురోజుకూ తగ్గిపోవడంతో చలి తీవ్రత పెరుగుతోంది. శనివారం జి.మాడుగులలో 8.9, అరకువ్యాలీలో 10.4 డిగ్రీలు కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయని స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్, వాతావరణ విభాగం నోడల్ అధికారి ఆళ్ల అప్పలస్వామి తెలిపారు. పాడేరు డివిజన్ పరిధిలో అనంతగిరి, డుంబ్రిగుడలో 11.4, పాడేరులో 12.0, గూడెం కొత్తవీధిలో 12.2, ముంచంగిపుట్టులో 12.3, చింతపల్లిలో 12.3, హుకుంపేటలో 12.4,పెదబయలులో 12.6, కొయ్యూరులో 14.5 డిగ్రీలు నమోదు అయినట్లు ఆయన పేర్కొన్నారు.

సాక్షి,పాడేరు: మన్యంలో చలిగాలుల తీవ్రత నెలకొంది. పొగమంచు దట్టంగా కురుస్తుండడంతో ఏజెన్సీలో సూర్యోదయం కూడా ఆలస్యమవుతోంది. జిల్లా కేంద్రం పాడేరులో శనివారం ఉదయం 10గంటల వరకు మంచు తెరలు వీడలేదు. పాడేరు మండలం మినుములూరు కేంద్ర కాఫీబోర్డు వద్ద 12డిగ్రీలు, అరకులోయ కేంద్ర కాఫీబోర్డు వద్ద 13 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. సాయంత్రం నుంచి చలిగాలులు విజృంభిస్తున్నాయి. ప్రజలు చలిమంటలతో పాటు ఉన్ని దుస్తులను ఆశ్రయిస్తున్నారు.

అంతర జిల్లాల డిప్యుటేషన్లు రద్దు చేయాలి

- యూటీఎఫ్ డిమాండ్
- రంపచోడవరం ఐటీడీఏ ఎదుట నిరసన



యూటీఎఫ్ ఆధ్వర్యంలో దీక్ష చేపట్టిన ఉపాధ్యాయులు

రంపచోడవరం: గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న రెగ్యులర్, సీఆర్‌టీ ఉపాధ్యాయుల అంతర జిల్లాల డిప్యుటేషన్లను నిరసిస్తూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఐటీడీఏ ఎదుట శనివారం నిరాహారదీక్ష చేపట్టారు. సబ్ కమిటీ కన్వీనర్ కె.ఆదిరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణ మాట్లాడుతూ అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం రాష్ట్రంలోని విద్యా వ్యవస్థను సంస్కరిస్తామని చెబుతూనే గురుకుల పాఠశాలల్లో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల శ్రమను దోపిడీ చేస్తోందన్నారు. దీక్ష శిబిరాన్ని గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోతా రామారావు, మాల మహానాడు అధ్యక్షుడు మాదే రామచంద్రరావు, హ్యూమన్‌రైట్స్ బాలు అక్కిస సందర్శించి మద్దతు తెలిపారు.

ప్రభుత్వం తక్షణమే స్పందించాలి

గురుకుల అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించి న్యాయం చేయాలని న్యాయవాది, సామాజిక వేత్త నోరి దత్తాత్రేయ కోరారు. స్థానిక ఐటీడీఏ ఎదుట నిరసన చేస్తున్న గురుకుల అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు శనివారం ఆయన మద్దతు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా నిరసన తెలుపుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న సీఆర్‌టీ ఉపాధ్యాయులను గురుకుల విద్యాలయాల్లో డిప్యూటేషన్ వేయడం దారుణమన్నారు. పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో ఇలాంటి నిర్ణయాలు ఇక్కడ విద్యార్థుల చదువుకు నష్టం కలిగించే పరిస్థితి వస్తుందన్నారు. ఇది గిరిజన విద్యా వ్యవస్థపై నిర్లక్ష్యమేనని విమర్శించారు. సుప్రీం కోర్టు ఉత్తర్వుల ప్రకారం సమాన పనికి సమాన వేతనం వర్తింపు చేయాలని ఆయన కోరారు.

మెరుగైన వైద్యం అందించాలి

- అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం



రోగుల యోగక్షేమాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం

అరకులోయ టౌన్: ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం సూచించారు. శనివారం స్థానిక ఏరియా ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగులతో మాట్లాడారు. వారికి అందుతున్న సేవల వివరాలను తెలుసుకున్నారు. ఎమర్జెన్సీ వార్డుతోపాటు ఇన్ పేషెంట్ వార్డులను పరిశీలించారు. రోగులకు మెరుగైన వైద్యం అందించాలని ఆస్పత్రి సూపరింటిండెంట్ రాముకు సూచించారు. ఆస్పత్రిలో మందుల నిల్వలపై ఆరా తీశారు.

తీరంలో తాబేళ్ల కళేబరాల కలకలం



తీరానికి కొట్టుకుని వచ్చిన తాబేళ్ల కళేబరాలు

కొమ్మాది (విశాఖ) : భీమిలి బీచ్ రోడ్డు మంగమారిపేట తీరం వద్ద పదుల సంఖ్యలో తాబేళ్ల కళేబరాలు కలకలం సృష్టిస్తున్నాయి. వాస్తవానికి భీమిలి తీరం నుంచి సాగర్‌నగర్ తీరం వరకు అప్పుడప్పుడు తాబేలు కళేబరాలు ఒకటి లేక రెండు కనిపిస్తుంటాయి. గత రెండు రోజుల నుంచి మంగమారిపేట తీరం వద్దకు కళేబరాలు కొట్టుకుని వస్తున్నాయి. గురువారం నాలుగు తాబేలు కళేబరాలు, శుక్రవారం రెండు తాబేలు కళేబరాలు, శనివారం రాత్రి ఏకంగా పది తాబేలు కళేబరాలు తీరానికి కొట్టుకుని వచ్చాయి. దీంతో మత్స్యకారులు కాస్త ఆందోళనకు గురవుతున్నారు. వాస్తవానికి డిసెంబర్ నుంచి ఫిబ్రవరి వరకు తాబేళ్లు వలస వెళ్లే సమయం కావడంతో.. వందల సంఖ్యలో తాబేళ్లు గుడ్లు పెట్టుకునేందుకు అనువైన స్థలం అన్వేషించుకుంటాయి. ఈ క్రమంలో తీరానికి వస్తున్న సమయంలో వేటకు వెళ్లే మత్స్యకారుల వలలు, గేలం వంటివి తగలడంతో ఎక్కువగా మృత్యువాత పడుతుంటాయి. అలాగే ఒడ్డుకు చేరుకుంటున్న తరుణంలో శ్వాస అందక ఎక్కువ శాతం మృత్యువాత పడుతుంటాయని జువాలజీ రిటైర్డ్ ప్రొఫెసర్ భరత లక్ష్మి తెలిపారు. ఒడిశాలోని రుషికొల్యా తీరంలో ఈ సీజన్‌లో వేల సంఖ్యలో తాబేళ్లు మృత్యువాత పడుతుంటాయని ఆమె తెలిపారు.

కలప, ఫర్నిచర్ అక్రమ రవాణా అవాస్తవం

- అన్నింటికి బిల్లులు సమర్పించిన రేంజ్ అధికారి మోహిని విజయలక్ష్మి
- వెల్లడించిన సబ్ డీఎఫ్‌వో రాఘవరావు, కూనవరం రేంజర్ కరుణాకర్

ఎటపాక: కూనవరం రేంజర్‌గా పనిచేసి బదిలీ అయిన మోహిని విజయలక్ష్మికి చెందిన కలప ఫర్నిచర్‌కు అన్ని బిల్లులు సక్రమంగా ఉన్నాయని సబ్ డీఎఫ్‌వో రాఘవరావు, కూనవరం రేంజర్ కరుణాకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల ఆమెకు చెందిన ఇంటి సామగ్రి తరలిస్తున్న వాహనాన్ని కొందరు అడ్డుకోవడం తెలిసిందే. ఆ వాహనంలోని ఫర్నిచర్‌ను నెల్లిపాక రేంజ్ కార్యాలయానికి తరలించి పంచనామా నిర్వహించామని వారు పేర్కొన్నారు.

ఫర్నిచర్‌కు సంబంధించి అన్ని పత్రాలను విజయలక్ష్మి చూపారని, వాటి విలువ రూ.1.57 లక్షలు ఉంటుందని వారు వివరించారు. కలప, ఫర్నిచర్ అక్రమ రవాణా అనేది అవాస్తవమని, తనిఖీపై చేసిన ఆరోపణలను ఖండిస్తున్నామని వారు తెలిపారు.

వ్యాన్ బోల్తా.. వృద్ధుడి మృతి

- ఇరువురికి గాయాలు
- పండ్ల లోడు తీసుకుని వెళ్తుండగా ప్రమాదం





బోల్తాపడిన పండ్లలోడు వ్యాన్ (ఇన్‌సెట్) చంద్రరావు మృతదేహం

చింతూరు: కొద్ది సేపట్లో గమ్యం చేరాల్సిన ఆ వృద్ధుడిని రోడ్డు ప్రమాద రూపంలో మృత్యువు కబళించింది. మండలంలోని వీరాపురం వద్ద శనివారం తెల్లవారుజామున జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మండలం శ్రీరామపురానికి చెందిన వృద్ధుడు కామశెట్టి చంద్రరావు(75) కుటుంబం కొన్నేళ్లుగా చింతూరు మండలానికి సరిహద్దునే ఉన్న ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుకుమా జిల్లా కుంటలో పండ్ల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి పండ్ల వ్యాన్‌లో లోడుతో భార్య లక్ష్మితో కలిసి చంద్రరావు చింతూరు మీదుగా కుంట బయలుదేరారు. తెల్లవారుజామున వీరాపురం వద్దకు వచ్చేసరికి అదుపుతప్పి బోల్తాపడటంతో చంద్రరావుకు తీవ్ర గాయాలయ్యాయి. అతనిని చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకువచ్చారు. అక్కడ చికిత్సపొందుతూ మృతిచెందాడు. ఈ ఘటనలో అతని భార్య లక్ష్మి, వ్యాన్ నడుపుతున్న మనుమడు శ్రీరామ్‌కు స్వల్ప గాయాలయ్యాయి. మరో పది నిమిషాల్లో గమ్యస్థానం చేరుకోనున్నారు. ఈ లోపే ఊహించని పరిస్థితుల్లో సంభవించిన ప్రమాదం వృద్ధుడు ప్రాణాన్ని పొట్టన పెట్టుకుంది. ఎస్ఐ రమేష్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుని కుమారుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

గ్రామ వలంటీర్లకు కూటమి ప్రభుత్వం మోసం



సమస్యలపై చర్చిస్తున్న గ్రామ వలంటీర్ల సంఘ నాయకులు

పాడేరురూరల్(అరకులోయరూరల్): గ్రామ వలంటీర్లకు కూటమి ప్రభుత్వం నమించి మోసం చేసిందని గ్రామ వలంటీర్ల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు బోనంగి చిన్నయ్యపడాల్ తెలిపారు. ఆయన శనివారం గ్రామవాలంటీర్ల సంఘం నాయకులతో సమవేశమయ్యారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబునాయుడు ఎన్నికల సమయంలో చెప్పిన మాటకు కటుబడి గ్రామ వలంటీర్లను విధులో తీసుకోవాలన్నారు. బకాయి పడ్డ ఏడు మాసాల వేతనాలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. త వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గ్రామ వలంటీర్లకు పెదపీట వేస్తే కూటమి ప్రభుత్వం వాటిని పూర్తిగా భూస్థాపితం చేయడం దారుణమన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో మోసపూరిత హమీలు ఇచ్చి మోసం చేసిందన్నారు. తాను అధికారంలో వస్తే గ్రామ వలంటీర్లకు రూ.10వేల ఇస్తానని చంద్రబాబు ఎన్నికల్లో ప్రచారం చేసి, అధికారంలోకి వచ్చాక హామీని మరిచారన్నారు. అన్ని వర్గాల ప్రజలకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు చిత్తశుద్ధితో నిలబెట్టుకోవలన్నారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న మోసాలపై ఈనెల 26, 27, 28 తేదీల్లో అని మండలాల్లో గ్రామ వలంటీర్లు సామూహిక రిలే నిరాహారదీక్షలు నిర్వహిస్తున్నమన్నారు. కూటమి ప్రభుత్వ ఇచ్చిన హామీలు అమలు చేసేంత వరకు దశలవారీగా ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. గ్రామ వలంటీర్ల సంఘం జిల్లా అధ్యక్షులు కొండబాబు, కార్యదర్శి ప్రసాద్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరావు, నాయకుడు సురేష్, తదితరులు పాల్గొన్నారు.

రిపబ్లిక్ డే పరేడ్‌కు ఏయూ విద్యార్థులు

విశాఖ విద్య : దేశ రాజధానిలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే రిపబ్లిక్ డే పరేడ్‌లో పాల్గొనడానికి ఏయూ జాతీయ సేవా పథకం నుంచి ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా పది మంది విద్యార్థులు ఎంపిక కాగా ముగ్గురు ఏయూ విద్యార్థులు కావడం గమనార్హం. ఇటీవల ఏయూ నుంచి ఆరుగురు విద్యార్థులు ప్రీ రిపబ్లిక్ డే శిక్షణ శిబిరానికి హాజరయ్యారు. వీరిలో ప్రతిభ కనబరిచిన ముగ్గురిని ఎంపిక చేశారు. నెలరోజులపాటు వీరు దేశ రాజధానిలో శిక్షణ పొంది జనవరి 26న జరిగే పరేడ్‌లో భాగమవుతారు. ఆనందపురం ఏక్యూజే పీజీ కళాశాలకు చెందిన యు.గణేష్, మల్కాపురంలోని సెయింట్ ఆన్స్ మహిళా కళాశాలకు చెందిన పి.దివ్యశ్రీ, సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలకు చెందిన గుడ్ల కుశాంక ఏయూ తరఫున ఎంపికైనట్లు ఉత్తర్వులు ఏయూ జాతీయ సేవా పథకం సమన్వయకర్త ఆచార్య ఎస్.హరినాథ్‌కి అందాయి.

సారా బట్టీ, పులుపు ధ్వంసం

చోడవరం రూరల్: స్థానిక ఎక్సైజ్ సబ్ డివిజన్ పరిధిలోని బుచ్చెయ్యపేట మండలం గొర్లెపాలెంలో పెద్ద ఎత్తున నాటు సారా తయారు చేస్తున్న బట్టీని, నిల్వ చేసిన పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్టు ఇన్‌స్పెక్టర్ కె.వి.పాపునాయుడు శనివారం తెలిపారు. గ్రామానికి దక్షిణ భాగంలో రెండు కిలోమీటర్ల దూరంలోని సరుగుడు తోటలో సారా తయారు చేస్తుండగా ఎస్ఐ ఎం.శేఖరం హెచ్‌సీలు ఎం.అప్పారావు, డి.గణేశ్వరరావు, సిబ్బంది ఆర్.రాంబాబులతో కలసి దాడులకు వెళ్లగా, సార తయారుదారులు పరారయ్యారని పేర్కొన్నారు. దాంతో సారా తయారీ బట్టీని, 400 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేశారని తెలిపారు. పరారైన వారి కోసం ఆరా తీస్తున్నామని, విచారణ అనంతరం నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ తెలిపారు.

విక్రాంత్ పయనమెటు?



స్వదేశీ పరిజ్ఞానంతో తయారైన అతి పెద్ద నౌకగా ఐఎన్ఎస్ విక్రాంత్ గుర్తింపు

- యుద్ధ విమాన వాహక నౌకపై తలో మాట చెబుతున్న కమాండింగ్ చీఫ్‌లు
- విశాఖ అమ్ములపొదిలో త్వరలోనే అని చెప్పిన ఈఎన్‌సీ చీఫ్ పెందార్కర్
- వెస్ట్రన్ నేవల్ కమాండ్‌లో చేరుతుందన్న సదరన్ చీఫ్ శ్రీనివాస్
- రక్షణ మంత్రిత్వ శాఖ దగ్గరకు విక్రాంత్‌పై ప్రకటనల పంచాయితీ

సాక్షి, విశాఖపట్నం: భారత్ పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో అత్యాధునిక విమాన వాహక యుద్ధ నౌక ఐఎన్ఎస్ విక్రాంత్‌ని తయారుచేసి అగ్ర దేశాల చూపును తన వైపు తిప్పుకునేలా చేసింది. ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్ యుద్ధ నౌకలు తయారు చేసిన అమెరికా, రష్యా, ఇంగ్లండ్, ఫ్రాన్స్ దేశాల సరసన నిలిచింది. 40 వేల టన్నుల బరువైన విక్రాంత్‌లో రెండు టేకాఫ్ రన్‌వేలు, ఒక ల్యాండింగ్ స్ట్రిప్‌తో పాటు ఏ క్షిపణీ దెబ్బతీయని విధంగా కొచ్చి షిప్‌యార్డులో నిర్మాణం పూర్తి చేశారు. 2022 సెప్టెంబర్ 2న ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేతుల మీదుగా జాతికి అంకితం అయిన ఐఎన్ఎస్ విక్రాంత్.. 2023 నెలాఖరులో తూర్పు నౌకాదళ అమ్ముల పొదిలో చేరుతుందని రక్షణ వర్గాలు ప్రకటించాయి. విక్రాంత్ రాక కోసం అవసరమైన ఏర్పాట్లకు సంబంధించిన చర్చలను తూర్పు నౌకాదళాధికారులు ఇప్పటికే మొదలుపెట్టేశారు.

> 'ఐఎన్ఎస్ విక్రాంత్‌ను తూర్పు నావికాదళానికి కేటాయించారు. విశాఖలో విక్రాంత్ బెర్తింగ్ కోసం ప్రత్యేకంగా ఏర్పాట్లు చేస్తున్నాం. ఇందు కోసం విశాఖ పోర్టు అథారిటీతో చర్చలు జరుపుతున్నాం. విశాఖ కేంద్రంగా విక్రాంత్ త్వరలోనే సేవలు ప్రారంభించనుంది.'
> – విశాఖలో ఈ నెల 2న తూర్పు నౌకాదళాధిపతి వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్ వ్యాఖ్యలు.

> 'ఐఎన్ఎస్ విక్రాంత్ ఎయిర్ క్రాఫ్ట్ క్యారియర్ అన్ని ట్రయల్స్‌ను దిగ్విజయంగా పూర్తి చేసుకుంది. ఫ్లీట్ ఇంటిగ్రేషన్ కూడా పూర్తయింది. ఇకపై ముంబై కేంద్రంగా విక్రాంత్ పశ్చిమ నౌకాదళానికి ప్రాతినిధ్యం వహిస్తుంది.'
> – కొచ్చిలో సదరన్ నేవల్ కమాండ్ చీఫ్ వైస్ అడ్మిరల్ వి.శ్రీనివాస్ ఈనెల 2న చేసిన వ్యాఖ్యలు.

> ఒకే యుద్ధ విమాన వాహక నౌక.. ఇద్దరు చీఫ్‌లు.. రెండు వేర్వేరు ప్రకటనలు.. అందర్నీ సందిగ్ధంలో పడేస్తున్నాయి. ఆది నుంచి విశాఖ అమ్ముల పొదిలోనే విక్రాంత్ చేరుతుందని నేవీ ప్రకటించింది. కానీ.. ఇప్పుడు రెండు భిన్నమైన వాదనలు తెరపైకి రావడం.. కొత్త సమస్యను తెచ్చినట్లుగా కనిపిస్తోంది.

పోర్టుతో కలిసి భారీ బెర్త్

నేవీ చరిత్రలోనే స్వదేశీ పరిజ్ఞానంతో తయారైన అతి పెద్ద నౌకగా ఐఎన్ఎస్ విక్రాంత్ బెర్తింగ్‌కు కావల్సిన సౌకర్యాలు విశాఖలో లేవు. పోర్టులో ఉన్న ఒక బెర్త్‌లో విక్రాంత్‌ని లంగరు వేసేందుకు అవకాశం ఉన్నా.. అది భద్రతకు ప్రమాదమని తూర్పు నౌకాదళం భావించింది. అందుకే.. విక్రాంత్‌కు ప్రత్యేక బెర్త్ ఏర్పాటు చేసేందుకు పోర్టు అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నారు. త్వరలోనే ఈ భారీ నౌకను లంగరు వేసేందుకు విశాఖలో ప్రత్యేక బెర్త్ ఏర్పాటు కానుంది.



చీఫ్‌ల వ్యాఖ్యలతో గందరగోళం

నేవీ డేకు ముందు ఈనెల 2వ తేదీన తూర్పు, పశ్చిమ, సదరన్ నౌకాదళాధిపతులు మీడియాతో మాట్లాడారు. ఇందులో ప్రత్యేకంగా విక్రాంత్ గురించి ఈఎన్‌సీ, ఎస్ఎన్‌సీ చీఫ్‌లు చేసిన వ్యాఖ్యలు గందరగోళంలోకి నెట్టేశాయి. ఆది నుంచి విశాఖ వస్తుందని భావించినా.. సదరన్ చీఫ్ మాత్రం వెస్ట్రన్ నేవల్ కమాండ్ నుంచి విక్రాంత్ త్వరలోనే సేవలు ప్రారంభిస్తుందని స్పష్టం చేయడం గమనార్హం. రక్షణ పరంగా, రవాణా పరంగా ఎంతో కీలకమైన హిందూ సముద్రంలో ఆధిపత్యం కోసం మన దేశంతో పాటు చైనా, అమెరికా మొదలైన దేశాలన్ని విశ్వ ప్రయత్నం చేస్తున్నాయి. ఇందులో పైచేయి సాధించేందుకు భారత్ సిద్ధం చేసిన బ్రహ్మాస్త్రమే ఐఎన్ఎస్ విక్రాంత్. విక్రాంత్ రాకతో రక్షణ పరంగా దుర్భేద్యంగా నిలవనుంది. అలా.. దేశంలో తయారు చేసిన అతి పెద్ద యుద్ధ నౌకగా చరిత్ర సృష్టించిన ఐఎన్ఎస్ విక్రాంత్.. ఇప్పుడు ఎక్కడ నుంచి సేవలు ప్రారంభిస్తుందోనన్న ఉత్సుకత నేవీ వర్గాల్లో మొదలైంది. ఇరు కమాండింగ్ చీఫ్‌లు చేసిన ప్రకటనల పంచాయితీ రక్షణ మంత్రిత్వ శాఖ దగ్గరికి చేరింది. దీనిపై నేవీ చీఫ్ రెండు మూడు రోజుల్లో ప్రకటన విడుదల చేసే అవకాశం ఉందిన నౌకాదళ వర్గాలు చెబుతున్నాయి.

ఐఎన్ఎస్ విక్రాంత్ విశ్వరూపం

పొడవు: 262 మీటర్లు	వెడల్పు: 62 మీటర్లు
ఎత్తు: 59 మీటర్లు	బరువు: 37,500 టన్నులు
నిర్మాణశైలి: 5 సూపర్‌స్ట్రక్టర్లు	14 అంతస్తులు
ఓడలో కంపార్ట్‌మెంట్‌లు: 2,200	మహిళా క్యాబిన్ 02
రన్‌వేలు-2 , ఒక ల్యాండింగ్ స్ట్రిప్	సిబ్బంది: 1,750 మంది
సాధారణ వేగం: 18 నాటికల్ మైళ్లు	గరిష్ట వేగం: 28 నాటికల్ మైళ్లు
సామర్థ్యం: 7,500 నాటికల్ మైళ్లు	సత్తా ఎంత: 30 విమానాలు, హెలికాప్టర్లను మోసుకెళ్లగలదు, గరిష్టంగా 40 వరకూ.. నిర్మాణంలో
పాలుపంచుకున్నవారు: 15,000 మంది సిబ్బంది, ఉద్యోగులు	ఏఏ విమానాలుంటాయి: మిగ్-29 విమానాలు, కమోవ్-31 విమానాలు, ఏఎల్‌హెచ్ హెలికాప్టర్లు, ఎంహెచ్-60
టర్బైన్లు: 4 ఎల్ఎం 2,500 ప్లస్ గ్యాస్ టర్బైన్లు	టర్బైన్ల సామర్థ్యం: 88 మెగావాట్లు
పార్కింగ్: 6 హెలికాప్టర్లు, 12 జెట్స్, నైట్ ల్యాండింగ్	ఆర్‌వో ప్లాంట్: 4 లక్షల లీటర్ల సామర్థ్యం
వ్యయం: రూ. 20,000 కోట్లు	సెన్సార్లు: 3 వేల ఫైర్ సెన్సార్లు,700 ఫ్లడ్ సెన్సార్లు
ప్రత్యేకత: మిగ్-29 విమానాలు ఎగరగలిగే డెక్ ఉండడం	మరో ప్రత్యేకత: ఒక చిన్న నగరానికి సరిపడా విద్యుత్‌ని ఉత్పత్తి చెయ్యగల టర్బైన్లు
నిర్మాణానికి ఉపయోగించిన స్పెషల్ గ్రేడ్ ఉక్కు: 21,500 టన్నులు	ఫ్లైట్ డెక్: 12,500 చ.మీ. (రెండున్నర హాకీ ఫీల్డ్‌లతో సమానం)

విక్రమాదిత్యని విశాఖకు కేటాయిస్తారా?

వెస్ట్రన్ నేవల్ కమాండ్ నుంచి ఇప్పటికే సేవలందిస్తున్న ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్ ఐఎన్ఎస్ విక్రమాదిత్య.. ప్రస్తుతం ఆధునికీకరణ కోసం సిద్ధమైంది. రూ.1207.5 కోట్లతో విక్రమాదిత్య యుద్ధ విమాన వాహక నౌక షార్ట్ రీఫిట్, డ్రైడాకింగ్‌తో పాటు అప్‌గ్రేడేషన్ పనులు చేపట్టాలని నిర్ణయించారు. ఇందుకోసం రక్షణ మంత్రిత్వ శాఖ కొచ్చి షిప్‌యార్డుతో ఇటీవలే ఒప్పందం చేసుకుంది. ఈ నేపథ్యంలో ముంబై కేంద్రంగా ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్ సేవలకు ఫుల్‌స్టాప్ పడింది. దీన్ని భర్తీ చేసేందుకు విక్రాంత్‌ను తాత్కాలికంగా వినియోగించనున్నారా..? లేదా.. విక్రాంత్‌ని ముంబైకి కేటాయించి.. అప్‌గ్రేడేషన్ చేసిన విక్రమాదిత్యని విశాఖకు కేటాయిస్తారా అనేది ప్రశ్నార్థకంగా మారింది.

సన్‌ఫ్లవర్..క్లిక్.. క్లిక్

- పర్యాటకులకు జోష్
- మంచి ఆదాయంతో రైతు ఖుషీ



సన్‌ఫ్లవర్ తోటలో ఫొటోలు తీసుకుంటున్న పర్యాటకులు



సాక్షి, పాడేరు: మన్యం సందర్శనకు వచ్చే పర్యాటకులు పొద్దుతిరుగుడు పూల శోభలో మునిగితేలుతున్నారు. అరకు, డుంబ్రిగుడ ప్రాంతాల్లో పాడేరు- అరకు ప్రధాన రహదారిని అనుకుని ఉన్న రైతులు పొద్దుతిరుగుడును సాగు చేస్తున్నారు. ప్రస్తుతం పూత దశలో ఉన్న ఈ పైరు పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఈ క్షేత్రాల్లో రంగు రంగుల గొడుగులు ఏర్పాటుచేయడంతో ఫొటోలు, సెల్ఫీలు తీసుకునేందుకు వారు ఆసక్తి చూపుతున్నారు. ఇందుకు గాను పర్యాటకుల ఒకొక్కరి నుంచి రూ.20 చొప్పున వసూలు చేస్తున్నారు. వారు అధిక సంఖ్యలో తరలిరావడంతో రైతులకు మంచి ఆదాయం సమకూరుతోంది.

రోజుకు రూ.2 వేల ఆదాయం



పొద్దుతిరుగుడు తోటలో ఫొటోలు, సెల్ఫీలు తీసుకునేందుకు పర్యాటకులను అనుమతిస్తున్నాం. ఒకొక్కరు రూ.20 చొప్పున చెల్లిస్తున్నారు. ఇలా రోజుకు రూ.2 వేల వరకు ఆదాయం వస్తోంది. కొంతమంది ఇవ్వకపోయినా ఒత్తిడి చేయడం లేదు.
– పి.రాము, గిరి రైతు, జంగిడివలస, డుంబ్రిగుడ మండలం

సమ్మోహనభరితం.. నృత్యోత్సవం



నృత్య కళాకారులు నాట్య విన్యాసాలు

మద్దిలపాలెం(విశాఖ) : విశాఖ ఆర్ట్ అండ్ డ్యాన్స్ అసోసియేషన్, ఆంధ్రప్రదేశ్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ కల్చర్ సౌజన్యంతో గురుపరంపర-2024 జాతీయస్థాయి నృత్యోత్సవాలు సమ్మోహన భరితంగా జరిగాయి. మద్దిలపాలెంలోని కళాభారతి ఆడిటోరియంలో శనివారం జరిగిన ఈ నృత్యోత్సవాల్లో నగరంలోని పలు కళా సంస్థల నృత్యకళాకారిణుల ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. అంతర్జాతీయ ఒడిస్సీ నాట్య కళాకారుడు ఆర్య దత్త, అంతర్జాతీయ కథక్ నృత్య కళాకారిణి డాక్టర్ గర్మి ఆర్య నృత్య ప్రదర్శనలు కళా హృదయాలను రంజింపచేశాయి. అనంతరం కళారత్న వెంపటి రవిశంకర్ జీవితసాఫల్య పురస్కారాన్ని అంతర్జాతీయ కూచిపూడి నిత్య కళాకారుడు మొసలి కంటి కిశోర్‌కు ప్రదానం చేశారు. అసోసియేషన్ కన్నం వెంకటరమణ రావు, ఆంధ్రప్రదేశ్ సీడ్స్ అండ్ అగ్రికల్చరల్ కార్పొరేషన్ చైర్మన్ గండి బాబ్జీ, విశాఖ మ్యూజిక్ అకాడమీ మాజీ ప్రధాన కార్యదర్శి ఎస్.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

మైత్రి జోష్



దివ్యాంగ విద్యార్థుల నృత్యాలు

విశాఖ విద్య : అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏయూ హ్యూమన్ జెనిటిక్స్, ఏక ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం మైత్రి వాక్ నిర్వహించారు. ఏయూ ప్రాంగణంలోని గాంధీ విగ్రహం వద్ద దివ్యాంగులు కొద్ది సేపు ఆడిపాడి, సందడి చేశారు. నగరంలోని పలు పాఠశాలలకు చెందిన దివ్యాంగ విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏయూ కాలేజీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ ఎంవీఆర్ రాజు, యంగ్ ఇండియన్ సభ్యురాలు కావ్య పూర్ణిమ మాట్లాడుతూ దివ్యాంగులకు పౌర సమాజంలో సమాన అవకాశాలు దక్కాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. దివ్యాంగుల్లో మానసిక స్థైర్యాన్ని నింపేలా ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఏక ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్టు ఫౌండర్ కె.శాంతి, ఏయూ జెనిటిక్స్ విభాగం ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మైత్రి వాక్‌లో దివ్యాంగ విద్యార్థులు, నిర్వాహకులు